నవీకరణ దిశగా సహకార సంఘాలు

ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంలో సహకార సంఘాల పాత్ర కీలకం. వాటిని మరింత బలోపేతం చేసి ప్రజలకు సేవలు సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అడుగులు వేసింది. ఇప్పటిదాకా చలామణి అవుతున్న సేవలను నవీకరణ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా కార్యాచరణ ప్రారంభించింది. తద్వారా సహకార సంఘాల్లో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు.. రూ.కోట్ల కుంభకోణాలు.. లెక్కలేనన్ని తప్పులకు ఇక చెక్ పడనుంది. నేషనలైజ్ బ్యాంకుల తరహా రుణాల వివరాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి పైసాకూ లెక్క తేలనుంది. – రాయదుర్గం


రాయదుర్గం ఏడీసీసీ బ్యాంకు కార్యాలయం


కంప్యూటరీకరణ చేస్తున్న ఉద్యోగులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మొత్తం 24 ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్)లు ఉన్నాయి. వీటి పరిధిలోని 20,522 రైతుల రుణాల ఖాతాలు ఉన్నాయి. రాయదుర్గం ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని డీకొండాపురం సొసైటీలో 1,089, గొడిశెలపల్లిలో 499, గొల్లపల్లిలో 524, కలుగోడులో 498, ఎం. హనుమాపురంలో 230, మల్లికేతిలో 341, 74 ఉడేగోళంలో 494, కణేకల్లు ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని బ్రహ్మసముద్రం సొసైటీలో 451, కణేకల్లులో 676, శ్రీధరఘట్టలో 291, ఉద్దేహాళ్‌లో 391, కళ్యాణదుర్గం ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని ఆవులెన్నలో 536, బండమీదపల్లిలో 565, బైరవానితిప్పలో 465, చాపిరిలో 1524, కంబదూరులో 715, శెట్టూరులో 393, ఉరవకొండ ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని ఆమిద్యాలలో 1350, కొట్టాలపల్లిలో 652, ఉరవకొండలో 1,380, విడపనకల్లులో 1,312, వజ్రకరూరులో 3,353, కూడేరులో 1,357, బెళుగుప్పలో 596 మంది లోనింగ్ ఖాతాదారులు ఉన్నారు. దాదాపు అన్ని సంఘాలు నష్టాల్లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. వీటి లోటు పూడ్చాలంటే నాబార్డు తప్పనిసరిగా రుణం ఇవ్వాల్సి ఉంది.

సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు



ప్రాథమిక సహకార సంఘాల్లోని సేవలను మరింత విస్తృతం చేసేందుకే నవీకరణ దిశగా శ్రీకారం చుట్టారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శక సేవలు అందించాలన్నదే ఏడీసీసీ లక్ష్యం. ఈ ప్రక్రియ అమల్లోకి తెచ్చేలా యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. ఉద్యోగులంతా దీనిపైనే కరసత్తు చేస్తున్నారు. ఇప్పటికే పీఏసీఎస్‌లకు కంప్యూటర్లు, 13 రకాల పరికరాలు పంపిణీ చేశాం. మూడు నియోజకవర్గాల్లోనూ దాదాపు 65 శాతం డేటా ఎంట్రీ పూర్తయింది. ఈ నెల ఆఖరిలోపు వంద శాతం పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాం. – ఫణీంద్ర, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్, రాయదుర్గం

ఉపయోగం ఇలా...

పీఏసీఎస్‌లను నాబార్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేలా కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. దీంతో సొసైటీలో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ కంప్యూటరైజ్డ్‌తో పాస్‌బుక్ వస్తుంది. అందులో తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, పడుతున్న వడ్డీ తదితర వివరాలు పక్కాగా ఉంటాయి. భూముల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలన్నీ నేరుగా రైతు ఖాతాలకే జమకానున్నాయి.

రీ సర్వే గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: మండలంలో జరుగుతున్న రీసర్వే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భాస్కర్ కోరారు. శనివారం మండల పరిధిలోని వర్లిలో రీ సర్వే గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో భూ విస్తీర్ణంలో వ్యత్యాసం, భూ స్వభావంలో తేడా, పేర్లలో తప్పులు, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, హద్దుల నిర్ణయంలో తేడాలు తదితర అభ్యంతరాలను గ్రామ సభల్లో స్వీకరిస్తామన్నారు. అనంతరం వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభ్యంతరాలను నవంబర్ 15లోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కంబదూరు: రీ సర్వేలో ఏమైనా భూ సమస్యలు ఉంటే గ్రామ సభల్లో పరిష్కారిస్తామని తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. శనివారం మండలంలోని గూళ్యం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు రైతుల నుంచి స్వీకరించారు. అన్ని రకాల భూ సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ గణేష్ , ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

22,23న గ్రామసభలు

కూడేరు: సమగ్ర భూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 22, 23న భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ శనివారం తెలిపారు. 22న ఉదయం తిమ్మాపురం, మధ్యాహ్నం ఎంఎంహళ్లి గ్రామాల్లో , 23న చోళసముద్రంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు రీసర్వే డీటీ ప్రసాద్ తెలిపారు.

బొమ్మనహాళ్: రీసర్వేలో భాగంగా వచ్చిన భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తహసీల్దార్ మునివేలు అన్నారు. శనివారం రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో తహసీల్దార్ మునివేలు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూమి విస్తీర్ణంలో తేడాలు, ఒకే సర్వే నంబరుల్లో అన్నదమ్ముల విభాగాలకు సంబంధించిన అర్జీలను పరిష్కారిస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రవితేజ, వీఆర్వో యుగేంధర్, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్న, గుండ్లపల్లి, కోనంపల్లి, గంగవరం గ్రామాల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షర్మిళ శనివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆవులెన్న, మధ్యాహ్నం 3 గంటలకు గుండ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలుంటాయన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కోనంపల్లి, మధ్యాహ్నం 3 గంటలకు గంగవరం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

వజ్రకరూరు: సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచించారు. శనివారం కొనకొండ్లలో ఉపాధిహామీ నిధులు రూ.65 లక్షలతో తొమ్మిది సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య,మాజీ ఎంపీపీ రామచంద్ర, పీఆర్ ఏఈ మణిభూషన్, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఏపీఓ లక్ష్మీకాంత, గ్రామకార్యదర్శులు, ఉపాధి సిబ్బ ంది తదితరులు పాల్గొన్నారు.


కొనకొండ్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు జలకళ

రాయదుర్గంటౌన్: పట్టణానికి శాశ్వత మంచినీటి సరఫరా చేస్తున్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు (ఎస్ఎస్ ట్యాంకు)కు జలకళ సంతరించుకుంది. ట్యాంకులోకి హెచ్చెల్సీ కాలువ నుంచి తుంగభద్ర జలాల పంపింగ్ నిరంతరంగా కొనసాగుతోంది. గరిష్ట స్థాయి నీటిమట్టానికి చేరువలో ఉంది. కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకులో రోజూ హెచ్చెల్సీ కాలువ ద్వారా నాలుగు భారీ స్థాయి మోటార్లతో నీటి పంపింగ్ జరుగుతోంది. నవంబర్ నెలాఖరు వరకు ఎస్ఎస్ ట్యాంకు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, డీఈ రవిప్రకాష్ నాయుడు తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటే 10 నెలల పాటు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. హెచ్ఎల్సీ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులో నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విడతల వారీగా హెచ్చెల్సీ పంపింగ్ పైప్‌లైన్ లీకేజీ పనులు కూడా క్షేత్రస్థాయిలో పూర్తి చేసి నీటి వృథాను అరికడతామన్నారు.


సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ

నర్రా చైతన్య మృతదేహానికి నివాళి

ఉరవకొండ: మాజీ సర్పంచ్ నర్రా సుజాత, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు అధినేత నర్రాకేశన్న దంపతుల కుమారుడు నర్రా చైతన్య బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. చైతన్య మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నర్రా కేశన్న ఇంటికి వెళ్లి మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు కూడా చైతన్య మృతికి సంతాపం తెలియజేశారు. జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు రాకెట్ల అశోక్, బసవరాజు, ఓబన్న, గోవిందు, ఆసీఫ్, ఈడిగ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, ఆమిద్యాల రాజేష్, ధనంజయ, వేమన్న, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


నర్రా చైతన్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణదుర్గం, కుంది ర్పి, బ్రహ్మసముద్రం, శెట్టూరు, మండలాల్లో డ్రిప్ కంపెని ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 2024–25 సంవత్సరాలకు చెందిన 6,900 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు కేటాయించామన్నారు. 15,434 హెక్టార్లకు దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ గౌసియా, డీసీఓలు, ఎంఐఏవో మల్లేష్, డీలర్లు, ఫీల్డ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

ముగిసిన 'పల్లె పండుగ'

కూడేరు: మండలంలో ఈ నెల 14 నుంచి మొదలైన 'పల్లెపండగ– పంచాయతీ' వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు మరుట్లలో రూ.13.50 లక్షలతో రెండు సీసీ రోడ్లు, ఉదిరిపికొండలో రూ.16.52 లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు ,ప్రజా ప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, పీఆర్ ఏఈ రమణయ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ తులసీ ప్రసాద్ , పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

వజ్రకరూరు: పంచాయతీ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నట్లు సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. శనివారం చాబాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మట్టి రోడ్లకు అడ్డంగా ఉన్న ముళ్లపాదలను జేసీబీతో తొలగించారు. కాలనివాసులు రామాంజనేయులు, నల్లబోతుల ఈశ్వరప్ప, భార్గవ్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉచిత నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి గ్రామం వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ తదితర కోర్సులకు 2 నుంచి 3 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులయిన వారు అర్హులన్నారు. ఈనెల 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పాలిటెక్నిక్ కళాశాలలో లేదా సెల్: 9440661900, 9010965230లో సంప్రదించాలన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఫిర్యాదు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ గ్రామానికి చెందిన గౌరీ అనే యువతిని శనివారం అదే గ్రామానికి చెందిన గోవిందప్ప కుమారుడు వెంకటేశులు దూషించాడు.దీంతో ఆమె పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పట్టణంలోని పార్వతీ నగర్‌కు చెందిన మహేష్ భార్య సూరియ కంబదూరు మండలం వెంకటంపల్లికి చెందిన తన బావ మునియప్పపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

ఉరవకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల భక్తుల మనోభావాలు దెబ్బతినేలా లడ్డూ ప్రసాదంపై రాజకీయం చేశారని, ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెస్త పవన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బీసీవై పార్టీ కార్యాలయం వద్ద పార్టీ ఇన్‌చార్జ్ పవన్ విలేకరులతో మాట్లాడారు. తిరుమల పవిత్రత, పరిరక్షణే ధ్యేయంగా రాజకీయాల్లోకొచ్చిన భారత చైతన్యపార్టీ అధినేత రామచంద్ర యాదవ్ లేఖకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామ సమీపంలోని పొలాల్లో 15 మంది పేకాటరాయుళ్లను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో దాడి చేసి, 15 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.82,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

22 నుంచి ఆధార్ క్యాంప్‌లు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ గ్రామ సచివాలయాల్లో ఈనెల 22 నుంచి 25 వరకు ఉచిత ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దాసా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ ఉచిత ఆధార్ క్యాంప్‌లను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మంజునాథ్

వజ్రకరూరు: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మంజునాథ్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణశర్మ తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో గుత్తి మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



వజ్రకరూరులో బహుమతులు అందిస్తున్న ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు, బొమ్మనహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

= ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

వజ్రకరూరు: బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. స్థానిక మినీ కల్యాణ మంటపం నుంచి గ్రామ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేష్ ద్వారా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టాలు, పరిష్కార మార్గాలు తదితర వాటిపై వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యా స రచన పోటీలు, బెలూన్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ వరకుమార్, హెచ్ఎం స్వర్ణలత, సీఓలు లింగారెడ్డి, రామకృష్ణమ్మ, నాగరాజు, ఉపాధ్యాయురాలు ప్రతిభ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలు, ఉద్యోగినులకు మరింత భద్రత అవసరమని ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజ సూర్యుడు తెలిపారు. శనివారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. పాఠశాల మైదానంలో బాలికలకు బెలూన్ క్రీడలు నిర్వహించారు. విజేత సాధించిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్‌టీఎల్ వాసంతి పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

రాయదుర్గం: మల్లాపురం తండా సమీపాన శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన బొమ్మన్న (50) దుర్మరణం చెందాడు. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం పెదార గుడ్డం వద్ద మొక్కజొన్న పొలంలో పనికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. బంధువులు విషయం తెలుసుకుని హుటాహుటిన అతడిని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే బొమ్మన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇతడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

నట్టల నివారణ మందుల పంపిణీ


నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి , పాలవెంకటాపురం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు వర్షాకాలంలో వచ్చే నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. శనివారం మండల పశువైద్యాధికారి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రెండు గ్రామ పంచాయతీల్లోనూ 3,936 జీవాలకు మందులు వేశారు. అనంతరం పశువైద్యాధికారి మాట్లాడుతూ వర్షా కాలంలో జీవాలకు నట్టలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది సుధ, కులశేఖర్, జలీల్, లింగన్న గౌడ, మంజుల, సుధీర్, నవీన్, గీత, భాను ప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన న్యాయమూర్తి

డి హీరేహాళ్ (రాయదుర్గం): నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి రమ్య శనివారం తనిఖీలు నిర్వహించారు. డీహీరేహాళ్ మండలంలోని సోమలాపురం బీసీ హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వార్డెన్ శ్రీనివాసులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా హాస్టళ్లలో తరగతి గదులు, వంటశాలలు, పరిసరాల పరిశుభ్రతను, మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు.

నేలకొరిగిన ద్రాక్ష పంట


హంసాయపల్లిలో ద్రాక్ష పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య

కూడేరు: మండలంలోని హంసాయపల్లిలో శనివారం వేకువజామున ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన రైతు రమేష్ నాయుడు రెండెకరాల్లో సాగు చేసిన ద్రాక్ష పంట పందిరితో సహా నేలకొరింది. ఉద్యానవన శాఖ అధికారి నెట్టికంటయ్య, వీఏఏ రాజకుమార్ నేలకొరిగిన ద్రాక్ష పంటను పరిశీలించారు. పంట కోత దశకు వచ్చిందని, ఈ పరిస్థితిలో గాలీవానకు పంటంతా నేల పాలైందని, సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు అధికారులతో వాపోయాడు.

ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు

కంబదూరు: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని, ఇళ్ల మధ్య ఏర్పాటు చేయరాదని మహిళలు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ రఫీకి శనివారం వినతి పత్రం అందించారు. బ్యాంకుతో పాటు వెలుగు కార్యాలయం, అధికంగా జనావాసాలు ఉన్నాయని, మద్యం షాపు ఏర్పాటు చేయకూడదని వినతి పత్రంలో పేర్కొన్నారు.

చిన్నారులపై కులవివక్ష తగదు


అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులపై కుల వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప, జిల్లా జేసీ నాయకులు దొణతిమ్మప్ప, ఎరడికెర చంద్ర , చన్నలమల్ల తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంత్యుత్సవం


దుద్దేకుంటలో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట గ్రామంలో వాల్మీకి యువత ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో వాల్మీకి చిత్రటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేక పూలతో అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొని, బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ రత్నమ్మ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో దుద్దేకుంట వాల్మీకి యువత, వాల్మీకి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి


వెంకటేశులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని వెంకటాద్రిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ తండ్రి, సీనియర్ నాయకుడు సోంపల్లి వెంకటేశులు (78) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కొన్ని రోజుల క్రితం అధిక రక్తపోటుతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్సకోసం చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పెన్నహోబిలం దేవస్థానాల కమిటీ మాజీ చైర్మన్ ముత్తులూరి అశోక్‌తో కలసి వెంకటేశులు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతుడి భార్య రుషేంద్రమ్మ, కుమారుడు అశోక్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామాంజనేయులు, పార్టీ జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

2,297 మందికి సబ్సిడీ విత్తన శనగ పంపిణీ


ఎన్.హనుమాపురంలో విత్తనశనగను రైతులకు అందిస్తున్న ఏఓ శ్రవణ్‌కుమార్

కణేకల్లు: మండలంలో 2,297 మంది రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,297 మంది రైతులకు 3,998 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశామన్నారు. మండలంలో 12 ఆర్‌ఎస్‌కే కేంద్రాల పరిధిలో ఉన్న రైతులకు విత్తనాలను అందజేశామన్నారు. నవంబర్ 15 వరకు శనగ విత్తుకోవచ్చన్నారు. విటావ్యాక్స్ పవర్ 3 గ్రాములు కేజీ శనగ విత్తనాలకు కార్బండజిమ్ 1 గ్రాము కేజీ విత్తనానికి తగిన మోతాదులో కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

తేమ మధ్యస్తంగా ఉన్నప్పుడే విత్తుకోండి


పప్పుశనగను అందిస్తున్న అధికారులు

కూడేరు: మండలంలోని తిమ్మాపురం, పి.నారాయణపురం పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన పప్పుశనగను రైతులకు పంపిణీ చేశారు. ఎల్‌జీ–11 రకం పప్పుశనగ మంచి దిగుబడి ఇస్తుందని ఏఓ విజయ కుమార్ తెలిపారు. ఒక రైతుకు ఒక ఎకరాకు గరిష్ఠంగా 40 కేజీల వరకు ఇస్తామన్నారు. వర్షాలు తగ్గాక తేమ మధ్యస్తంగా ఉన్నప్పుడే పప్పుశనగ విత్తుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, వీఏఏ రాజకుమార్, వీహెచ్ఏ సాయిప్రమోద్, రైతులు పాల్గొన్నారు.

అద్దెగదిలో శీగలపల్లి ప్రాథమిక పాఠశాల


అద్దెగదిలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల

కుందుర్పి: మండలంలోని శీగలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేక అద్దెగదిలో కొనసాగుతోంతోంది. 61 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. శీగలపల్లిలో పాఠశాల భవన నిర్మాణాల పనులు ఆగిపోయాయి. పలుమార్లు జిల్లా విద్యాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. విధిలేక ఎస్సీ కాలనీలోని ఓ అద్దె గదిలో పాఠశాలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.